క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ వీరాంజనేయులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో సూర్య కాలేజీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు శంకుస్థాపన చేశారు. రూ. 87 లక్షల మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్లు తాతకుంట్ల నాగలక్ష్మి, చింతలపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తాతకుంట్ల రవి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ చింత అనిల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

కామవరపుకోట: తడికలపూడిలో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ కడిమి రమేష్ మంగళవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షల నిధులతో సీసీ డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు జెడ్పీటీసీ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



సారికను అభినందిస్తున్న అధ్యాపకులు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న కామవరపుకోట గ్రామానికి చెందిన విద్యార్థిని బి.సారిక ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల సీనియర్ విభాగం హ్యాండ్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు తెలిపారు. ఏలూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించడంలో సారిక కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు, అధ్యాపకులు సారికను అభినందించి, బంగారు పతకంతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు



అధికారులు స్వాధీన పరుచుకున్న పురుగుమందులు

కామవరపుకోట: స్థానిక భాగ్యలక్ష్మి పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ షాపుపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఏ విధమైన పత్రాలు లేని రూ.5,94,014 విలువ కలిగిన పురుగుమందులను, వేరొక గోడానులో రూ.3,99,646 విలువ కలిగిన పురుగుమందులను, మొత్తంగా 23 రకాల పురుగుల మందులను స్వాధీన పరుచుకుని షాపు యజమాని గుల్ల శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్ తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.కుమార్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి సి.పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



ద్వారకాతిరుమల: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని



కొయ్యలగూడెం: అచ్యుతాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న ప్రజలు

ద్వారకాతిరుమల: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతగానో దోహదపడుతుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమల వసంత్‌నగర్ కాలనీలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారితో పాటు, క్షేత్రానికి విచ్చేసిన ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను వారు పరిశీలించారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని సందర్శించారు. అనంతరం పలువురికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో లబ్ధిదారులకు నేరుగా సుమారు రూ.3 లక్షల 15 వేల కోట్ల సంక్షేమ ఫలాలను జమచేసినట్టు చెప్పారు. పేదల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగానే ప్రతి గ్రామం, వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా, జనరల్ వైద్యులతో పాటు స్పెషలిస్టులను సైతం అందుబాటులో ఉంచి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం కొమ్మినేని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెచ్చిన పలు సంస్కరణల ఫలాలు పేదలు, మధ్యతరగతి వారికి ఎంతో మేలు చేస్తున్నాయని, వాటిని బట్టి రాష్ట్రానికి ముమ్ముందు జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో మహిళా శిశువు ఆరోగ్యానికి అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, సిబ్బంది చేస్తున్న సేవలను కొమ్మినేని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, శ్రీవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, జి.కొత్తపల్లి పార్టీ ప్రెసిడెంట్ దాసరి ఏసురత్నం, తిరుమలంపాలెం సొసైటీ చైర్‌పర్సన్ బోగరాజు చిన్ని, ఉక్కుర్తి వెంకట్రావు, దాకారపు అగ్గియ్య, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ తదితరులున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని వెంకటాద్రిగూడెం సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ కార్డులను అందచేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎంపీటీసీ కృష్ణారావు, ఎంఈఓ జి.రామారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ఆరోగ్య సురక్ష

కొయ్యలగూడెం: అచ్యుతాపురంలోని ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. సర్పంచ్ మద్దిపాటి నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ పరిధిలోని శ్రీరంగపట్నం, త్రినాధపురం, శ్రీరామ్‌నగర్ శివారు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కొయ్యలగూడెం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్తేరు రాణి నేతృత్వంలో వైద్య బృందం పరీక్షలు చేశారు. ముఖ్యంగా కంటి సంబంధిత రోగులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా వారికి కంటి వైద్య నిపుణులు బొల్లిన కిషోర్ పరీక్షలు నిర్వహించి త్వరలోనే కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని అన్నారు. ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి రోగులకు ఔషధాలు పంపిణీ చేశారు.

498 మందికి వైద్య సేవలు

కామవరపుకోట: స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 498 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్య అధికారి డాక్టర్ సునీల్ వర్మ తెలిపారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ కడిమి రమేష్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరు సద్వినియోం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్, సర్పంచ్ కర్రిపోతు అనూష, ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, వైస్ ఎంపీపీ గిరిజా, ఎంపీటీసీ బొల్లు సత్యనారాయణ, ఎంపీడీఓ కంతేటి శ్రీదేవి, ఎంఈఓ డి.సుబ్బారావు, డా.రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ప్రయోజనం

టి.నరసాపురం: జగనన్న సురక్ష కార్యక్రమం నిరుపేదలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చుతుందని వైఎస్సార్‌సీపీ మండల యూత్ నాయకులు దేవరపల్లి సీతారామ్ ప్రసాద్, కన్నం సర్వేశ్వరరావు అన్నారు. టి.నరసాపురంలో రెండవ సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

వేలేరుపాడు: సంక్షేమ పథకాలతోపాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సి పేర్కొన్నారు. మంగళవారం వేలేరుపాడు మండలంలోని మేడేపల్లి గ్రామంలో సర్పంచ్ కట్టం రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికీ ఉచిత వైద్యం అందుతోందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని వైద్యసేవలు పొందాలని కోరారు. తహసీల్దార్ జీ ఎలీషా, ఎంపీడీఓ మూర్తి, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, వైద్యాధికారులు అగత, మౌలాలి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీటీసీ తుర్రం తమ్మయ్య, మండల వైఎస్సార్ సీపీ నాయకులు కామినేని వెంకటేశ్వరావు, మండల సచివాలయ కన్వీనర్ కొలూరి సత్తిరాజు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

బుట్టాయగూడెం: మండలంలోని నిమ్మలగూడెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచులు బన్నె బుచ్చిరాజు, మాల్చి వెంకన్నబాబు, ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ప్రారంభిస్తారని మునిసిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాంగే నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ 10వ సచివాలయానికి సంబంధించిన ప్రజలు పాల్గొని వైద్యసేవలు పొందాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే బాలరాజు పర్యటన

బుట్టాయగూడెం: మండలంలోని సీతప్పగూడెం సచివాలయంలో బుధవారం ఉదయం 8.30 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్ భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మాతా అన్నపూర్ణేశ్వరీ.. శరణు



జంగారెడ్డిగూడెం: అన్నపూర్ణాదేవి అలంకరణలో వాసవీమాత



కొయ్యలగూడెం: కన్నాపురంలో కాశీ అన్నపూర్ణగా కనకదుర్గమ్మ



బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో అన్నపూర్ణా దేవిగా కనకదుర్గమ్మ



చింతలపూడి: విశ్వనాథ మఠంలో మీనాక్షిదేవిగా రాజరాజేశ్వరీ



ద్వారకాతిరుమల: అన్నపూర్ణా దేవి అలంకరణలో వాసవీమాత



టి.నరసాపురం: శాకాంబరి అలంకరణలో కనకదుర్గమ్మమ్మ

జంగారెడ్డిగూడెం: భిక్షాందేహి కృపావలంబనరీ.. మాతా అన్నపూర్ణేశ్వరీ అంటూ శరణు ఘోషతో అమ్మవారి ఆలయాలు మార్మోగాయి. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని గంగానమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ, విజయదుర్గమ్మ, వాసవీ మాత, హైస్కూల్ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. గంగానమ్మ తల్లి అన్నపూర్ణాదేవిగా, నూకాలమ్మ, ముత్యాలమ్మ తల్లి గాయత్రీ దేవిగా, ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద వేంచేసియున్న వాసవీమాత అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. హైస్కూల్ వద్ద ఉన్న కనకదుర్గమ్మను మహాలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. విజయదుర్గమ్మకు సహస్ర తామరపువ్వులతో పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణా దేవిగా.. కుంకుళ్లమ్మ, వాసవీమాత

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు మంగళవారం అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. శంకుచక్రాలను ధరించి, పరమేశ్వరుడికి అన్నప్రసాదాన్ని అందిస్తున్న అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు సైతం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కాశీ అన్నపూర్ణగా కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: శరన్నవరాత్రులలో భాగంగా కనకదుర్గమ్మ కాశీ అన్నపూర్ణేశ్వరి అలంకరణతో మంగళవారం ప్రత్యేక పూజలు అందుకుంది. కొయ్యలగూడెం శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ కన్నాపురం శ్రీ విజయలక్ష్మి కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవి అలంకరణతో పూజలు అందుకోగా యర్రంపేటలోని ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి భక్తులు నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి చంద్రఘంటాదేవిగా, బయ్యనగూడెం కనకదుర్గమ్మ గాయత్రి మాత అలంకరణతో భక్తులు పూజలు చేశారు. రాజవరంలో భవానీలు దీక్షదారులై ఉత్సవాల సందర్భంగా నెలకొల్పిన అమ్మవారికి శరణు ఘోష చేస్తూ పూజలు చేశారు.

బుట్టాయగూడెం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ ఆలయంతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిర్లలో అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కొత్తపేటలో దొరమామిడి, స్థానిక త్రిశక్తిపీఠంలో దసరా ఉత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. జీలుగుమిల్లిలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

చింతలపూడి: చింతలపూడి విశ్వనాథ మఠంలో వేంచేసిఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారు మంగళవారం భక్తులకు మీనాక్షిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన జరిపించారు. కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు హాజరై అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

టి.నరసాపురం: మండలంలో వాడవాడలా దసర శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. టి.నరసాపురం కనకదుర్గమ్మ అమ్మవారు శాకాంబరిదేవి (అన్నపూర్ణా దేవి)గా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే టి.నరసాపురం కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో విశాలాక్షి అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

పశువుల అక్రమ రవాణా.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: స్థానిక బైపాస్‌రోడ్డు ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎటువంటి పత్రాలు లేకుండా అనకాపల్లి నుంచి హైదరాబాద్ కబేళాకు గిత్తదూడలను తరలిస్తుండటాన్ని గుర్తించి ఆ వాహనాన్ని సీజ్ చేశారు. 17 గిత్తదూడలను తమ్మినాడు గోసంరక్షణా సేవా సమితి నిర్వహిస్తున్న గోశాలకు తరలించి, వాహనంలోని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి సబ్‌స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఏ పోలవరానికి చెందిన దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణ అనే ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై జీలుగుమిల్లి వెళ్తుండగా అశ్వారావుపేటవైపు నుంచి జంగారెడ్డిగూడెం వైపు వస్తున్న కారు ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో గాయాలపాలైన యువకులను 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తక్షణ సాయం అందజేత

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఆరో వార్డుకు చెందిన జీరి దుర్గారెడ్డి ఇటీవల అనారోగ్యం మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా మట్టిఖర్చుల కింద మంజూరైన రూ.10 వేలను కౌన్సిలర్ నేకూరి కిషోర్, నాయకులు రాంబాబు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నవరత్నాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. కలరాయనగూడెంలో మంగళవారం జరిగిన 194వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ చలగుళ్ల రవిబాబు, పార్టీనాయకులతో కలసి ఎలీజా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తమ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్, మండల సచివాలయాల కన్వీనర్ అన్నపనేని శాంతరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పేదలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందని, ప్రతి ఒక్కరూ మారుతున్న పరిస్థితులను అందిపుచ్చుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. స్థానిక శ్రీ చత్రపతి శివాజీ శ్రీ శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం స్వయం సహాయక బృందాలు, తాడేపల్లిగూడెం వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హార్టికల్చర్ యూనివర్సిటీ, మెప్మా ఏలూరు డిస్ట్రిక్ట్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించారు.